జగనన్న కాలనీలపై నిర్లక్ష్యం !

- ప్రభుత్వం మారడంతో నిలిచిన అభివృద్ధి పనులు
- రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు
- తాగునీటికి కటకట
- పట్టించుకునే వారేలేరని ప్రజల ఆవేదన

పెనుకొండ రూరల్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో ఇళ్ల స్థలాలను ఇవ్వడంతో పాటు నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వం ప్రోత్సహించింది. జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి విద్యుత్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసింది. అయితే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో నిలిచిన పోయిన పనులను పట్టించుకునే వారే కరువయ్యారు. కొన్నిచోట్ల రహదారులు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు వేడుకుంటున్నారు.

- పెనుకొండ పట్టణంలోని జగనన్న లేఅవుట్‌లో సీసీ రోడ్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగు నీరుపోయే మార్గం లేక అపరిశుభ్రత ఏర్పడుతోంది. నీటి వసతి లేకపోవడంతో నీటి ట్యాంకర్ రూ.500 పెట్టి కొనగోలు చేస్తున్నారు. పట్టణానికి సమీపంలోనే గొల్లపల్లి రిజర్వాయర్ ఉన్నప్పటికీ వందల రూపాయలు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు.



పెనుకొండలో ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన రోడ్డు

- పెనుకొండ మండల వ్యాప్తంగా కొండంపల్లి, మరువపల్లి, శెట్టిపల్లి, గోనిపేట, అడదాకులపల్లి, నాగళూరు గ్రామాల్లో జగనన్న లేవుట్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్లు వేయలేదు. దీనికి తోడు డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- రొద్దం మండలంలోని తురకలాపట్నం, పెద్దగువ్వలపల్లి, రొద్దం, పెద్దమంతూరు, కలిపి గ్రామాల్లో వీధి దీపాలు కరువవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేవని తమ బాధ ఎవరికి పట్టడం లేదని వారు వాపోతున్నారు.
- గోరంట్ల మండల కేంద్రంతో పాటు వానవోలు, ఎముకలగుట్టపల్లి, జీనవాండ్లపల్లి, మారెమ్మగుడి, మల్లాపల్లి గ్రామాల్లో జగనన్న కాలనీలు ఉన్నాయి. ఇందులో కూడా నేటికీ సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు సమస్యలు ఉన్నాయి.
- పరిగి మండలంలో మోదా, కొడిగినహళ్లి, బీచిగానిపల్లి గ్రామాల్లోనూ సమస్యలు తిష్ట వేశాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో ఆయా వీధులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.
- సోమందేపల్లి మండల కేంద్రంతో పాటు బుసయ్యగారిపల్లి, మాగేచెరువు, పందిపర్తి, కేతగానచెరువు, చాలకూరు గ్రామాల్లో జగనన్న కాలనీలు ఉన్నాయి. విద్యుత్, రోడ్లు, డ్రైనేజీ కాలవలు, తాగునీటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పెనుకొండ నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఉన్న ఇళ్లు

మండలం	ఉన్నవి	నిర్మాణంలోఉన్నవి
పరిగి	132	181
పెనుకొండ	1042	925
రొద్దం	63	136
సోమందేపల్లి	718	725
గోరంట్ల	1311	1291

వసతులు కల్పించండి



జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నాము. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మొత్తం కోతకు గురయ్యాయి. తాగు నీటికి పడరాని పాట్లు పడుతున్నాము. ట్యాంకర్ల ద్వారా తాగునీటిని కొనుగోలు చేస్తున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నాము.

– ఓబులమ్మ, పెనుకొండ

ప్రయాణం నరకంగా ఉంది



జగనన్న కాలనీలోకి వాహనంలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్లు కోతలకు గురయ్యాయి. వర్షాలు అధికంగా కురిస్తే కొండ ప్రాంతాల నుంచి నీటి ఊట ప్రవహిస్తోంది. డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాము.

– నగేష్ ,పెనుకొండ



రొద్దంలోని జగనన్న కాలనీలో రహదారిపై పిచ్చి మొక్కలు



పెనుకొండ: ట్యాంకర్ల ద్వారా నీటిని తోలించుకుంటున్న స్థానికులు



గోరంట్ల: మల్లాపల్లిలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

క్లుప్తంగా

వేలం ద్వారా రూ.లక్ష ఆదాయం

చిలమత్తూరు: మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచాయతీ యగ్నిశెట్టిపల్లి చెరువులో చేపల పెంపకానికి బుధవారం సచివాలయం వద్ద వేలంపాట నిర్వహించారు. ఈ మేరకు సర్పంచ్ తిరుమలేష్ మాట్లాడుతూ చిలమత్తూరుకు చెందిన రాజు అనే వ్యక్తి రూ. 1,0,1500 అత్యధికంగా వేలం పాడి చెరువును దక్కించుకున్నట్లు తెలిపారు.

'ప్రత్యామ్నాయం'పై దృష్టి సారించండి



అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభారతి

పరిగి: వ్యవసాయంలో రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలి. మంచి లాభాదాయకమైన పంటలు సాగు చేసేలా చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి విజయభారతి తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని శ్రీరంగరాజుపల్లి, గొరవనహళ్లి గ్రామాల్లో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ప్రధానంగా రబీ సీజన్‌లో పంటలకు ఆశించే పురుగులు, వాటి నివారణోపాయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఈఓ నాగవేణి, సిబ్బంది రాధ, అనిల్, సువర్ణ, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

108లో ప్రసవం



అంబులెన్స్‌లో బిడ్డకు జన్మనిచ్చిన గర్భిణి

పెనుకొండ రూరల్: 108 వాహనంలో గర్భిణి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. శెట్టిపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంధ్యకు బుధవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. సకాలంలో స్పందించిన సిబ్బంది శెట్టిపల్లికి చేరుకున్నారు. అయితే గర్భిణి హైరిస్క్ కారణాలను గుర్తించి కుటుంబ సభ్యుల సలహా మేరకు అనంతపురం తరలించేందుకు నిర్ణయించారు. అయితే మార్గమధ్యంలో సంధ్య ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది దాదాబాషా, నరసింహమూర్తి ప్రథమ చికిత్సను అందించి తల్లీబిడ్డలను క్షేమంగా అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

చేపల చెరువు వేలం

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి, బైరేపల్లి చెరువుల్లో చేపలు పెంపకానికి బుధవారం గ్రామ సచివాలయంలో ఈఓఆర్డీ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. పీసీ గిరికి చెందిన చెరువును అదే గ్రామానికి చెందిన యంజారేగౌడు రూ.40 వేలకు, బైరేపల్లి చెరువును హనుమంతరాయప్ప రూ.90 వేలకు దక్కించుకున్నారని ఈఓఆర్డీ తెలిపారు. ఈ నిధులు పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డీఎల్ యంజారేగౌడు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భూవివాదంపై ఆర్డీఓ విచారణ



భూవివాదంపై విచారణ చేస్తున్న ఆర్డీఓ సువర్ణ

గోరంట్ల: మండల పరిధిలోని మల్లాపల్లి నెలకొన్న భూ వివాదంపై ఆర్డీఓ సువర్ణ బుధవారం ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. ఆ గ్రామ పొలం సర్వేనంబర్ 268లోని రెండు ఎకరాల పొలాన్ని 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసినా రెవెన్యూ అధికారులు పట్టా పాసుపుస్తకాలు మంజూరు చేయలేదంటూ ఇటీవల రైతు చెన్నప్ప దంపతులు పుట్టపర్తి కలెక్టర్ టీఎస్ చేతన్ వద్ద మొరపెట్టుకోవడంతో పాటు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఆర్డీఓ మల్లాపల్లికి చేరుకొని విచారణ చేశారు. త్వరలోనే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు.

'అపార్' వేగవంతం చేయండి

రొళ్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదును వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. బుధవారం నాటికి అలుపనపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 41.64 శాతం, రత్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో 30.02 శాతం, హొట్టేబెట్ట జెడ్పీహెచ్ఎస్‌లో 24.39 శాతం, రొళ్ల జెడ్పీహెచ్ఎస్‌లో 31.44 శాతం మాత్రమే పూర్తి కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నాటికి ఉపాధ్యాయులు వందశాతం అపార్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి



స్కూల్ పరిసరాలు శుభ్రం చేయించాలని సూచిస్తున్న ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: స్థానిక నింకంపల్లిరోడ్డులో శారదా మున్సిపల్ స్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద పిచ్చి మొక్కలు తొలగించి విషపురుగులు రాకుండా విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందిగా లేకుండా చేయాలని ఇన్‌చార్జి చైర్మన్ బలరామిరెడ్డి సిబ్బందికి సూచించారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, మేస్త్రీలు వెంకటేశు, నారాయణస్వామిలను పిలిపించి తక్షణమే పనులు చేయించాలని ఆదేశించారు. అలాగే సమీపంలోని పైప్‌లైన్ లీకేజీ సరిచేసి నీరు వృథాకాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డుపై డంప్ బిన్ అస్తవ్యస్తంగా ఉందని వెంటనే చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించి శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురికి కాల్వలను ఎప్పటకప్పుడు శుభ్రం చేయాలన్నారు.

సైబర్ బుల్లీయింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ రాజ్‌కుమార్

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్యక్షతన మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా, సైబర్ బుల్లియింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ బుల్లీయింగ్‌లో సైబర్ ఫిషింగ్, సైబర్ ఇంజినీరింగ్ మోసాలతో పాటు సైబర్ క్రైమ్స్ నిరోధించడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ఫోటో మార్ఫింగ్, షేరింగ్ ఆఫ్ అబ్యూసింగ్ థింగ్స్, ఇన్ ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్ ఇతరాత్ర వాటిలో కాలయాపనకు వాటిని ఇతరులకు షేర్ చేయడం వంటి చేయకుండా జాగ్రత్తలు పడాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు హేమలత, అనిల్‌కుమార్, చంద్రశేఖర్‌నాయక్, నాగసాయి, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు బాధ్యతగా పనిచేయాలి



రాజ్య వాల్మీకి సేవా రత్న పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

పావగడ: రాష్ట్రస్థాయి వాల్మీకి సేవా రత్న పురస్కారాలు అందుకున్న ప్రముఖులు మరింత బాధ్యతగా పనిచేయాలని నిడుగల్ వాల్మీకి సంస్థానాధిపతి వాల్మీకి సంజయ కుమార స్వామి తెలిపారు. తుమకూరులోని బాల గంగాధరనాథ స్వామి జీ సర్కిల్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాల్మీకి సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాల్మీకి సమాజంతో పాటు ఇతర సామాజిక వర్గాలను సైతం బాగుపరచే విధంగా అవార్డు గ్రహీతలు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక నివృత్త ఆర్టీఓ బి తిప్పేస్వామి, పావగడ వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ అనిల్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురికి రాష్ట్రస్థాయి వాల్మీకి సేవా రత్న పురస్కారాలు అందించారు.

నదిలోకి 'రసాయన వ్యర్థాలు'



పైప్‌లైన్ పగలడంతో గార్మెంట్స్ వ్యర్థాలు నదిలో కలుస్తున్న దృశ్యం, పైప్‌లైన్ పగలిన దృశ్యం

- పట్టించుకోని అధికారులు

పరిగి: మండలంలోని కాలువపల్లి వద్ద ఉన్న టెక్స్‌పోర్ట్ డిజైన్స్ గార్మెంట్స్ నుంచి విషపూరిత రసాయన వ్యర్థాల లీకేజీతో జయమంగళి నది కాలుష్యంగా మారుతోంది. దీంతో నది ప్రవాహక గ్రామాల్లోని రైతులు, పాడి రైతులకు పెను ప్రమాదకరంగా మారింది. గార్మెంట్స్ పరిశ్రమ స్థాపించిన నాటి నుంచి ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గార్మెంట్స్ పరిశ్రమ మండలంలోని మేజర్ పంచాయతీగా ఉన్న కొడిగెనహళ్లి పరిధిలో ఉంది. దీని నుంచి విడుదలయ్యే రసాయనిక విషపూరిత వ్యర్థాలు పరిగి మేజర్ పంచాయతీ పరిధిలోని జయమంగళి నదిలో కలుస్తున్నా రెండు పంచాయతీ పరిధిలోని అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనకడుగేస్తున్నారు. తాజాగా మరోసారి పైప్‌లైన్ పగిలిపోవడంతో రసాయనాలు లీకేజ్ అవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు మరోసారి చోటు చేసుకోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



హిందూపురం: మత పెద్దలతో చర్చిస్తున్న జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ



మడకశిర: అవగాహన కల్పిస్తున్న జడ్జి ఆర్.అశోక్‌కుమార్

హిందూపురం అర్బన్: బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలు కృషి చేయాలని జిల్లా అదనపు జడ్జి కంపల్లె శైలజ సూచించారు. బుధవారం స్థానిక జిల్లా అదనపు కోర్టు ఆవరణలో మత పెద్దలతో బాల్య వివాహాలపై సమీక్ష నిర్వహించారు. న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల మానసికంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఇలా ఎన్నో ఇబ్బందులు వస్తాయన్నారు.

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మంటపం సమీపంలోని బీసీ బాలికల హాస్టల్‌ను జడ్జి ఆర్.అశోక్‌కుమార్ బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా బాల్య వివాహ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నతస్థాయి చేరుకోవాలన్నారు.

అమరాపురం/హిందూపురం/రొళ్ల/అగళి/మడకశిర రూరల్: అమరాపురం, రొళ్ల, అగళి, మడకశిర మండలం, హిందూపురం పట్టణాల్లో బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా బుధవారం ఐసీడీఎస్‌తో పాటు మండలస్థాయి అధికారులు, వివిధ స్కూళ్లలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామంటూ పలుచోట్ల ప్రతిజ్ఞ చేయించారు.

హోటళ్లను తనిఖీ చేసిన అధికారులు



పద్మశ్రీ హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారిణి తస్లీమా భాను

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డులోని పద్మశ్రీ హోటల్‌తో పాటు పలు టీస్టాళ్లను బుధవారం హిందూపురం ఫుడ్ సేఫ్టీ అధికారిణి తస్లీమా భాను తనిఖీ చేశారు. పద్మశ్రీ హోటల్‌లోని కిచెన్ రూమ్ అపరిశుభ్రతగా ఉందని గుర్తించారు. ఏమాత్రం సేఫ్టీ లేదని పేర్కొన్నారు. అదేవిధంగా ఫ్రీన్స్ చాయ్ దుకాణానికి లైసెన్సు లేదని నోటీసులు అందించారు. 14 రోజుల్లోపు హోటల్‌లో మార్పు చేయాలని, వంటలకు వాడే నూనే ఒకసారి మాత్రమే వాడాలన్నారు. నూనెను మళ్లీ మళ్లీ వాడకూడదన్నారు. అలాగే ఫుడ్ కలర్స్ వాడకూడదని వంటవాళ్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సచివాలయం తనిఖీ

లేపాక్షి: మండల పరిధిలోని కల్లూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ నరసింహమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావాలని, బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనులు గుర్తించేందుకు గ్రామసభ

అమరాపురం: మండలంలోని హలుకూరు, అమరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై ఏపీఓ జగదీష్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వాటికి ఆమోదం తెలిపేందుకే గ్రామసభ నిర్వహించామన్నారు. ఏఏ గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టాలి, పనుల వివరాలు, ఇంకా ఏమైనా అవసరముంటే వాటిని గ్రామసభలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, అధికారులు, రైతులు కూలీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మడకశిర: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగ యువతి, యువకులు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. టెన్త్ నుంచి పీజీ పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

పొలం బాట పట్టిన రైతన్న



వరి సాగుకు ట్రాక్టర్‌తో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

పెనుకొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు నిండటంతో రైతులు పొలం బాట పట్టారు. మండల పరిధిలో పలువురు రైతులు వరిని సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగానే ట్రాక్టర్లలో భూములను సిద్ధం చేసుకుంటున్నారు.

మడకశిరటౌన్ సీఐగా రాగిరి రామయ్య



మడకశిర: మడకశిర టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం రాగిరి రామయ్య బాధ్యతలు చేపట్టారు. ఇది వరకే టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మనోహర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాగిరి రామయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అక్రమ మద్యం, గుట్కా, ఇసుక రవాణాతో పాటు మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టి అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

పరిగి: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప మాలాధారణ భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొన్నేళ్లుగా అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మాలాధారణ సమయంలో కావడంతో అయ్యప్ప మాలాధారులకు మధ్యాహ్న సమయంలో బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అయ్యప్పస్వామి భక్త మండలి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం నుంచి జనవరి నెల 8వ తేదీ వరకూ అయ్యప్ప మాలాధారులకు మధ్యాహ్నం సమయంలో బిక్షను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వామి నరసింహులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ కిటకిట



ఆధార్‌లో మార్పు కోసం వేచి ఉన్న జనం

పెనుకొండ: పట్టణంలోని 1వ గ్రామ సచివాలయంలోని ఆధార్ సెంటర్‌కు జనం భారీగా తరలివస్తున్నారు. పాఠశాలలతో పాటు ఇతర సంస్థల్లో ఆధార్‌లో మార్పులు చేయించుకోవాలని ఉపాధ్యాయులు, తదితరులు సూచించడంతో ఆధార్‌లోని లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రజలు క్యూ కడుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గంటల తరబడి ఆధార్ సెంటర్ వద్ద నిలబడాల్సి వస్తోంది. సర్వర్ సమస్యలు తలెత్తినా సిబ్బంది ఓపికగా ప్రజలకు సహకారమందిస్తూ ఆధార్‌లో మార్పులు చేస్తున్నారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామి హుండీ కానుకల లెక్కింపును బుధవారం ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.3,42,151 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. వచ్చిన మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ జగన్నాథ్, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

అమరాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో సమగ్ర సర్వే పక్కాగా చేపట్టాలని కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి ఎంపీడీఓ రామరావు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 పంచాయతీ గ్రామాల్లో సమగ్ర సర్వే చేయాలన్నారు. గ్రామాల్లో ఏఏ దుకాణాలు ఉన్నాయి, వాటి వివరాలను నమోదు చేయాలన్నారు. గురువారం నుంచి ఫిబ్రవరి 2025 లోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ విశ్వేశ్వరరాధ్య, ఈఓఆర్డీ నాగముని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.